ప్రజాశక్తి
శనివారం 24 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం



టెన్త్ సప్లిమెంటరీలో 64.71శాతం ఉత్తీర్ణత


ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో పార్వతీపురం జిల్లా 64,71శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 6,126 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 3,819 (62.34శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 1,414 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 915(64.71) మంది పాసయ్యారు. రెండు జిల్లాల్లో 7,540 మంది పరీక్ష రాస్తే.. 4,734 మంది పాసయ్యారని, 2,806 మంది ఫైయిలయ్యారని తెలిపారు. ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా12వ స్థానం, విజయనగరం 14వ స్థానంలో నిలిచింది.

విద్యుత్తు షాక్‌తో విలవిల

కేంద్ర ప్రభుత్వ దర్శకత్వం, రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం యాక్షన్‌తో ప్రజలకు విద్యుత్ షాక్ తగిలింది. సర్దుబాటు పేరుతోనే యూనిట్‌పై సుమారు రూ.80పైసలకు పైగా పెంచారు. దీంతో నెలకు జిల్లా ప్రజలపై రూ. 80లక్షలు, ఏడాదికి రూ.24కోట్లు భారం పడనుంది. ఇతరత్ర ఛార్జీలు కలిపితే అసలు కన్నా కొసరు ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారుల్ని నిలువదోపిడీ చేస్తున్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు.

- సర్దుబాటు పేరిట బాదుడు
- నెలకు రూ.24 కోట్ల భారం
- ఇతరత్రా రూపాల్లోనూ బాదుడు
- మోడీ దర్శకత్వంలో జగన్ యాక్షన్ తీరు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 8,11,017 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు 6,71,921, వాణిజ్యం 68,939, ప్రభుత్వ కార్యాలయాలకు 15,321, వ్యవసాయ పంపుసెట్‌లకు, 52,082 ఉన్నాయి. వీటన్నింటికీ ఎపిఇపిడిసిఎల్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. వినియోగదారులంతా ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లిస్తున్నారు. ఒక వేళ గడువు తేదీలోపు చెల్లించకపోతే ఫీజులు పీకేసి మరీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ లెక్కలు వేశాక వినియోగదారులు చెల్లించిన డబ్బులు విద్యుత్తు ఉత్పత్తికి, పంపిణీ తదితర ఖర్చులకు సరిపోలేదంటూ వసూలు చేస్తున్నారు. సర్దుబాటు ఛార్జీ అంటే ఇదే. మరే సంస్థలోనూ లేని విధంగా విద్యుత్ పంపిణీ సంస్థల్లోనే ఇటువంటి విధానం అమలవుతుంది. ఇందులో భాగంగానే 2014 నుంచి 19 వరకు వినియోగించుకున్న విద్యుత్‌కు చెల్లించిన బిల్లులు సరిపోలేదంటూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,900 కోట్లమేర సర్దుబాటు భారం మోపింది. జనం నుంచి మూడేళ్లపాటు వసూలు చేయడానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు ఆమోదం పొందాయి. ఇప్పటికే యూనిట్‌కు 20పైసలు చొప్పున 11నెలల పాటు వినియోగదారులు చెల్లించారు. మరో 25నెలలపాటు ఇంకా చెల్లించాల్సివుంది. ఇది చాలదన్నట్టుగా 2021 -22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్ బిల్లులకు చెల్లించిన మొత్తం సరిపోలేదంటూ మరోసారి 20పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు మోపుతున్నారు. పాత, కొత్త సర్దుబాటు ఛార్జీలు 40పైసలు మోయడమే వినియోగదారులకు అత్యంత కష్టతరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ భారాన్ని తగ్గించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పడుతున్న భారాలకు ఎప్పటి వరకో ఎందుకు ఆగాలి అంటూ మరుచటి నెలలోనే సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించింది. మోడీ ఆదేశాలే తడువుగా జగన్ సర్కారు ఏప్రిల్ నెలలో చెల్లించిన డబ్బులు సరిపోలేదని మరో 40పైసలు వసూళ్లకు సిద్ధపడింది. ఈ లెక్కన కేవలం సర్దుబాటు ఛార్జీ రూపంలోనే 80పైసలు భారం పడుతోంది. జిల్లాలో రోజుకు సుమారు కోటి యూనిట్ల వినియోగం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వాసులపై నెలకు రూ.80లక్షల వరకు భారం పడుతోంది. ఏడాదికి రూ.24కోట్ల పైమాటే భారం. దీనికితోడు నెలవారీ వినియోగపు బిల్లు, ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపంలో అధిక మొత్తంలో బిల్లులు విధించారు. 20 నుంచి 30 యూనిట్లు వినియోగించిన సామాన్య కుటుంబాలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. దీంతో, గత నెలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో బిల్లులు వచ్చాయంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఛార్జీకన్నా ఇలా కొసరుగా విధిస్తున్న ఛార్జీలే అధికంగా ఉన్నాయి. దీంతో, తమకు అర్థం కాకుండా కొత్తకొత్త రూపాల్లో ఛార్జీలు పెంచి తమను మోసం చేస్తున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సర్దుబాటు ఛార్జీలకు పాలకుల విధానాలే కారణం. బొగ్గు, ఇంధన రేట్లు కార్పొరేట్ సంస్థలు తమ ఇష్టానుసారంగా పెంచుకునేందుకు సహకరిస్తున్నాయి. ఫలితంగా విద్యుత్ తయారీ, పంపిణీ సంస్థలపై పెరిగిన భారాన్ని ప్రజలపై మోపేందుకు బార్లు తెరుస్తున్నాయి.

ఎలా బతకాలి?



మే నెలలో కరెంటు బిల్లు రూ.130 వచ్చింది. ఈనెల రూ.330 వచ్చింది. ఒక లైటు, ఒక ఫ్యాను వేసుకుంటే ఇంత భారమా? ఇందేం పని అని కరంటోళ్లను అడిగితే అదేదో ఛార్జీలు పెరిగాయంటున్నారు. నెలరోజుల వ్యవధిలో రెట్టింపు కన్నా మించిపోయింది. మరీ ఇంత మోసమా? గ్యాస్ ధర కూడా పెంచేశారు. ఇప్పుడు కరెంట్లో పని. ఎలా బతకాలి? ఎవరికి చెప్పుకోవాలి?

- టి. విజయమ్మ, గృహిణి, గుమ్మలక్ష్మీపురం

చిన్న వ్యాపారులం బతకలేం



నా లాంటి చిరువ్యాపారులు బతకలేరు. 15ఏళ్లగా జ్యూస్ దుకాణం నడుపుతున్నాను. ఇదే జీవనాధారం. మిక్సీవాడడం వల్ల చాలా కాలంగా నెలకు రూ.800 నుంచి రూ.1000 కరెంటు బిల్లు వచ్చేది. బిజినెస్ పెరగక పోయినప్పటికీ జూన్ నెల బిల్లు రూ.1,526 వచ్చింది. ఇలా అయితే జీవనోపాధి కోల్పోయినట్టే.

- కె.రమేష్, జ్యూస్ వ్యాపారి, పూసపాటిరేగ



సభా స్థలిని పరిశీలిస్తున్న వైసిపి నాయకులు, అధికారులు

సిఎం సభా వేదిక పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కురుపాంలో ఈనెల 28న పర్యటించనున్న నేపథ్యంలో సభావేదికను సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశీల రఘురాం, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యేలుపి.పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మైదానం విస్తీర్ణం సభలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులకు అనుకూలంగా ఉంటుందో లేదో చూసి క్షుణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, చినమేరంగిలో గల పాలిటెక్నికల్ కళాశాల వద్ద సిఎం హెలిపాడ్ ల్యాండింగ్‌కు ఈ రెండు స్థలాలను, వాహనాలు పార్కింగ్ ప్రజలు రాకపోకలకు వెళ్లే మార్గాలను పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎస్‌పి జివి కృష్ణారావు, పంచాయతీరాజ్ ఇఇ ఎంవిఆర్ కృష్ణాజీ, తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఆర్ అండ్‌బి ఎఇ నిర్మలకుమారి, ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు బహిష్కరణ

ప్రజాశక్తి వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలసలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వి.కళావతి, పి.విక్రాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అదే గ్రామానికి చెందిన దళితులు బహిష్కరించారు. దళిత వీధుల్లో ఏ విధమైన అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో పాటు, సమస్యలు కూడా పట్టించుకోవటడ లేదని, పార్టీ పేరు చెప్పడమే తప్ప ఏ విధమైన అభివృద్ధి జరగలేదని అందుకుగానూ ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు దళితులు తెలిపారు.



వర్షానికి నర్సిపురంలో వరినారుమళ్లలో చేరిన నీరు

వర్షం.. రైతుల హర్షం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పట్టణంతో పాటు మండలంలో శుక్రవారం వేకువజామున 2 గంటల నుంచి కురిసిన ఎడతెరపి లేని వర్షం పట్ల రైతులు హర్షం ప్రకటిస్తున్నారు. గత నెల రోజులుగా రికార్డ్ స్థాయి ఉష్ణోగ్రతల మధ్య నలిగిపోయిన ప్రజానీకం ఈ వర్షం ఎంతో ఊరట ఇచ్చింది. పంట పొలాల్లో నీరు చేరుకోగా, నారుమళ్లకు సిద్ధం చేసుకున్న భూముల్లో విత్తనాలు చల్లుకోవడానికి కర్షకులు సమాయత్తమవుతున్నారు. వర్షానికి పట్టణంలోని పలు కాలనీలు జలమయం కాగా, ఉరుములు, మెరుపులతో పాటు ఎడమతేరిపి లేకుండా పిడుగులు పడడంతో ప్రజలు భీతిల్లారు. పిడుగుపాటుకు చిన్న బండపల్లిలో శ్లాబు ఇల్లు పాక్షికంగా దెబ్బతినడంతో పాటుగా పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇన్వర్టర్లు ఫ్యాన్లు కాలిపోయాయి. దీంతో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పట్టణంలోని ప్రధాన రహదారి సైతం జలమయం కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభించుకోవడానికి ఎంతగానో ఎదురుచూస్తున్న రైతన్నలకు ఈ చినుకులు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరో మూడు రోజులు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేయడం నిజంగా రైతులకు శుభవార్త.

251 మంది రక్తదానం

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన జన్మదిన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం బొబ్బిలి కోటలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తమ అభిమాన నేత జన్మదినం సందర్భంగా నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేసేందుకు యువత, టిడిపి కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రక్తదానం చేసేందుకు 400 మంది హాజరుకాగా, 251 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ముందుగా రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, బేబినాయన కలిసి ప్రారంభించారు. బొబ్బిలి బ్లడ్ బ్యాంకు, విజయనగరం రెడ్ క్రాస్, రోటరీ బ్లడ్ బ్యాంకు సిబ్బంది రక్తాన్ని సేకరించారు.

ఏజెన్సీలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీగా ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు మద్దతు ధరతో పాటు ఉపాధి అవకాశాలు ఉంటాయని నారీశక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి అన్నారు. సిఎసిపి దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సమావేశం విశాఖలో జరిగింది. విశాఖపట్నం పార్క్ హెూటల్‌లో 7 రాష్ట్రాలకు సంబంధించి కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రయిసెస్ వ్యవసాయ మంత్రిత్వ శాఖ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో సిఎసిపి విజయపాల్ శర్మ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎపి తరపున నారీశక్తి అవార్డుగ్రహీత భూదేవి మాట్లాడుతూ రానున్న 2024-25లో రబీ పంటలకు ధర నిర్ణయం, రైతుకు వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవడం వల్ల వరి, చిరుధాన్యాలు మిగతా పంటలు విస్తీర్ణం పడిపోయిందన్నారు. దీంతో రైతులు వ్యవసాయం నుంచి దూరమవుతున్నారని, ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ ఆ ధరలకు కొనుగోలు చేయటం లేదన్నారు. పంటలు కొనుగోలు చేసేటప్పుడు అనేక రకాల అవంతారాలు చూపి కొనుగోలు చేయటం లేదని కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే గిరిజన ప్రాంతంలో పైనాపిల్ రైతులకు కూడా మద్దతు ధర, క్రాప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో పండించే పసుపుకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ మద్దతు ధర రావటం లేదు కనుక పసుపుకు వాల్యూ ఎడిషన్ చేయాలని కోరారు.



వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్

జగనన్న సురక్షతో సేవలు చేరువ

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు జగనన్న సురక్ష లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. శుక్రవారం స్థాని వైకెపి కార్యాలయంలో సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారని, ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపించేలా చేపడుతున్న వినూత్న కార్యక్రమమని కావున అధికారులంతా ఇంటింటికీ వెళ్లి సమస్య తెలుసుకొని పరిష్కరించేలా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, కలెక్టర్ నిషాంత్ కుమార్ జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సాలూరు: స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేరుగా సిఎం జగన్ మోహన్‌రెడ్డి సందేశాన్ని ఆలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరిరఘు గొర్లి వెంకటరమణ రాపాక మాధవరావు,పప్పల లక్ష్మణరావు, కమిషనర్ హెచ్ శంకరరావు,మెప్మా సిఎంఎం ఎం.పుష్ప , డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కొమరాడ : గ్రామాల్లో ఉన్న ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ప్రవేశపెడుతుందని ఎంపిడిఒ మల్లికార్జునరావు అన్నారు. సిఎం ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం స్థానిక ఆర్‌బికెలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పులి సంచారంపై గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

ఏనుగులను కవ్వించొద్దు : డిఎఫ్ఒ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఏనుగుల గుంపు కొమరాడ మండలం పెదవలసలో బస చేశాయని, అయితే స్థానికులు ఆకతాయితనంతో ఏనుగులను కవ్విస్తున్నారని, అటువంటివి చేసి ప్రమాదాలు తెచ్చుకోవద్దని జిల్లా అటవీ శాఖ అధికారి జీఎపి ప్రసూన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీ శాఖ క్షేత్రస్థాయి అధికారులను ఏనుగుల సంచారంపై నిత్యం పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించామన్నారు. అటవీశాఖ సిబ్బంది గ్రామస్తులకు ఏనుగుల వివరాలను తెలియజేస్తూ వారికి తగు సూచనలు, సలహాలు అందించామన్నారు. ఏనుగులు కోపోద్రిక్తం కావడానికి ఎటువంటి చర్యలు చేపట్టొద్దని, వాటి గమ్యం దిశగా ఎటువంటి ఆటంకాలు కల్పించొద్దని ఆయా గ్రామస్తులను కోరారు. ఏనుగులను తరిమివేసేందుకు అటవీ శాఖకు ఎటువంటి ఉత్తర్వుల్లేవని, వాటిని కేవలం పర్యవేక్షించి ఏ ప్రాంతంలో ఉన్నాయో తెలియజేయడమే ప్రస్తుతానికి చేపడుతున్నామని చెప్పారు. ఏనుగుల బారినపడి జిల్లాలో ఇప్పటి వరకూ పది మంది మృత్యువాత పడినట్లు ప్రసూన తెలిపారు. అటవీశాఖ ఇప్పటివరకు రూ.2.17 కోట్లు పంట నష్టపరిహారంగా చెల్లించామని, మరో రూ.28 లక్షలు పెండింగ్‌లో ఉందని, దీన్ని త్వరలో చెల్లిస్తామని చెప్పారు.

పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం మండలం, మక్కువ సరిహద్దు ప్రాంతాల్లో పులి కదలికలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు శివారు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పార్వతీపురం సంఘంవలస, చిన్నబొండపల్లి, కవితిభద్ర, గంగాపురం, బుదురువాడ, డికె పట్నం, ఆడారు గ్రామాల్లో అటవీ శాఖ సిబ్బంది శ్రీనివాసరావు, కృష్ణారావు సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సాయంత్రం ఏడు గంటలు దాటిన తర్వాత ఉదయం 6 గంటల లోపు పంట పొలాలకు వెళ్లేవారు గుంపులుగా వెళ్లాలని, ఒంటరిగా వెళ్లడం శ్రేయష్కరం కాదని తెలిపారు.

ఐఎఫ్‌పి, స్మార్ట్ టీవీలను త్వరగా ఇన్‌స్టాల్ చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఐఎఫ్‌పి, స్మార్ట్ టీవీల గ్రీన్ బోర్డులను సాధ్యమైనంత తొందరగా ఇన్‌స్టాల్ చేసి విద్యార్థులకు వాటి ద్వారా పాఠ్యాంశాలను బోధించాలని రాష్ట్ర బృంద సభ్యులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర బృందం సభ్యులు మండలంల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, ఎపి గిరిజన గురుకుల బాలికల పాఠశాల (పి టి జీ), బాలుర గురుకుల పాఠశాల, కెజిబివి బాలికల పాఠశాలలను పరిశీలించి సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. ఈనెల 28న జగనన్న అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ కురుపాం వస్తున్న నేపథ్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ అన్ని పాఠశాలలను పరిశీలిస్తారని తెలిపారు. ఆ సమయానికి ఉపాధ్యాయులు, సిబ్బంది గ్రీన్ బోర్డులను, స్మార్ట్ టీవీలను తక్షణమే ఇన్స్టాల్ చేసి విద్యార్థులకు పాఠ్యాంశాలను అందించాలని సూచించారు.

కెజిబివిని సందర్శించిన విద్యాశాఖ కమిషనర్

ప్రజాశక్తి - సీతానగరం



విద్యార్థినిలతో మాట్లాడుతున్న విద్యాశాఖ కమిషనర్

మండలంలోని జోగింపేటలో గల కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలకు వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు ఉపాధ్యాయుల బోధన విషయాలపై, అలాగే తెలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఇఒ జి.సూర్యదేవుడు, కెజిబివి స్పెషలాఫీసర్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' ముందస్తు సర్వే ప్రారంభించాలి : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో జగనన్న సురక్ష పథకం తొలి విడత జరుగు 37 గ్రామాల్లో శనివారం నుంచి ముందస్తు సర్వే నిర్వహించాలని జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు మండల అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష పథకం అమలుపై శుక్రవారం కలెక్టరు కార్యాలయం నుంచి ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జెసి జగనన్న సురక్ష పథకం విధివిధానాలను తెలిపారు. జూలై 1 నుంచి మండల టీం పర్యటించేలా షెడ్యూలు తయారు చేయడం జరిగిందని, జిల్లాలో 1వ తేదీన తొలి టీం పర్యటించినుండగా ఈనెల 29 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతగా జూలై 1న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే 37 గ్రామాల్లో రేపటి నుండి వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, వాటిని సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రజలకు అత్యవసరమైన 11రకాల సర్టిఫికెట్లను ఈ కార్యక్రమం ద్వారా అందించాలన్నారు. పతి గ్రామంలో జగనన్న సురక్ష ప్రోగాం నిర్వహణకు వారం రోజులు ముందుగా ముందస్తు టీం పర్యటించాలని తెలిపారు. గ్రామాల్లో ముందస్తు కార్యక్రమం సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

చెరువు చప్టా ధ్వంసం

ఇరిగేషన్ అధికారుల అండతో భూస్వామి ఆగడాలు
ఆయకట్టు రైతుల ఆందోళన

ప్రజాశక్తి -సాలూరు


మండలంలోని కూర్మరాజుపేటలో లక్ష్మీసాగరం అనే చెరువు చప్టాను భూస్వామి తెగ్గొట్టడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం చెరువు చప్టాను భూస్వామి గోపరాజు జెసిబి సాయంతో ధ్వంసం చేసిన గుర్తించి ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 195లో లక్ష్మీ సాగరం చెరువు 8.5ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని కింద సుమారు 200మంది రైతులకు సంబంధించిన 110 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఈ ఆయకట్టు భూములన్నీ పండాలంటే లక్ష్మీసాగరం చెరువు ఒక్కటే ఆధారం. భారీ వర్షాలకు ఈ చెరువు నిండి పుష్కలంగా నీరు ఉంటే ఆయకట్టు కింద భూముల్లో వరి సాగు వీలవుతుంది. ఇలాంటి చెరువు పక్కన పామాయిల్ తోట ఉన్న భూస్వామి గోపరాజు చెరువు నిండుగా నిండితే తన పామాయిల్ తోట మునిగిపోతున్నదని ఫిర్యాదు చేశారు. ఆయన మాట వాస్తవమేనని భావించి ఇరిగేషన్ అధికారులు చెరువులో నీరు నిల్వ లేకుండా చేసేందుకు భూస్వామితో చప్టాను తెగ్గొట్టించారు. చప్టాను తెగ్గొట్టడంతో రానున్న వర్షాకాలంలో చెరువులోని నీరు నిల్వ ఉండే అవకాశం లేదు. ఇది తెలుసుకున్న ఆయకట్టు రైతులు లబోదిబో అంటూ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరిగేషన్ ఎఇ షేక్‌ఆలీ, విఆర్వో రాము చెరువును పరిశీలించారు. తెగ్గొట్టిన చప్టాను తిరిగి నిర్మించకపోతే రైతులతో కలిసి ధర్నా చేస్తామని నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షులు కె.సూర్యనారాయణ, రైతు నాయకులు సాలాపు కోటేశ్వరరావు, ఆముదాల అప్పారావు హెచ్చరించారు. చెరువులో నీరు నిల్వ లేకుండా చేసిన భూస్వామి గోపిరాజుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. భూస్వామి గోపిరాజు ఇరిగేషన్ అధికారుల అండతో చెరువు చప్టాను తెగ్గొట్టించారని రైతులు ఆరోపిస్తున్నారు.



తవ్వేసిన చప్టా

జిల్లా కోఆర్డినేటర్‌గా వెంకటరమణ

ప్రజాశక్తి - సీతంపేట



నియామక పత్రాన్ని అందుకుంటున్న వెంకటరమణ

జిల్లాకు కొత్తగా మంజూరైన స్కిల్ కాలేజ్ జిల్లా కో ఆర్డినేటర్‌గా బి.వెంకట రమణ నియమితులయ్యారు. స్థానిక వైటిసిలో స్కిల్ కాలేజీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి కో-ఆర్డినేటర్‌గా వెంకటరమణ నియమితులయ్యారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ స్కిల్ కాలేజీ పనులు, అందులో నిర్వహించే కోర్సులపై గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య శిక్షణ అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, నాక్ ఎడి చిట్టిబాబు, స్కిల్ హబ్ ఇన్‌ఛార్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిసిసి స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సహకార సంస్థ ద్వారా అందిస్తున్న బియ్యం తదితర నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. శుక్రవారం కురుపాంలో గల జిసిసి స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టాక్ నిల్వలు రిజిస్టర్లను పరిశీలించి గిరిజన ప్రాంతంలో ఏ ఒక్క కార్డుదారుడు ఇబ్బంది పడకుండా సక్రమంగా రేషన్ అందేలా చూడాల్సిన బాధ్యత జిసిసి సిబ్బందిదేనని అన్నారు. కురుపాంలో ఇండియన్ గ్యాస్ గోదాము ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. కార్యక్రమంలో జిసిసి డిఎం మహేంద్రకుమార్, బ్రాంచి మేనేజర్ కృష్ణప్రసాద్, సూపరింటెండెంట్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అంతా ప్రారంభ ఆర్భాటమే

ప్రజాశక్తి -పాలకొండ

నగర పంచాయతీలో పాతసామాన్లు సేకరించడం కోసం గత నెల రీసైకిల్ సెంటర్ ప్రారంభించారు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కేంద్రం మూడు రోజుల ముచ్చటగా మారింది. ఒక్కరోజు కూడా తలుపులు తీసిన దాఖలాలు లేవు. ఇంటింటికి వెళ్లి సిబ్బంది పాత సామాన్లను సేకరించి అక్కడ అందించాల్సి ఉన్నప్పటికీ అక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. కనీసం తలుపులు కూడా తీసిన దాఖలాలు లేవు. దీంతో పట్టణ వాసులు పెదవి విరుస్తున్నారు. అధికారులు ఎంతో ఆర్భాటంగా ఆరంభిస్తారే తప్పా ఆచరణలో అమలు చేయరని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ కేంద్రం సక్రమంగా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం జిల్లా నాయకులు

30న విజయవాడలో రైతు సంఘం మహాధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, బలరాము పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ వాగ్దేవి అన్నారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోగులు చికిత్స పొందుతున్న వార్డులను రక్త నిల్వ, ల్యాబ్లను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, రక్త నిల్వలపై ఆరా తీసి ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన గొయ్యి

తవ్వారు... వదిలేశారు

ప్రజాశక్తి - పార్వతిపురం టౌన్

పట్టణంలోని 11వ వార్డు నెయ్యిల వీధి ముందర తాగునీటి పైపు లైన్ లీకు మరమ్మతుల కోసం ఆ విభాగం సిబ్బంది గత ఐదు రోజుల క్రితం గొయ్యిను తవ్వారు. పని చేసిన తర్వాత ఇప్పటికీ ఆ గొయ్యిని కప్పేందుకు చర్యలు చేపట్టలేదు. దీంతో అదే వీధి గుండా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే సందర్భాలు కోకొల్లలు... ఇప్పటికైనా ఆ వార్డు కౌన్సిల్ సభ్యులు, ఇంజనీరింగ విభాగం అధికారులు, గోతిని కప్పేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దిశాయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్న మహిళలు

'టేక్ హోం రేషన్' కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

ఇటీవల, రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వం ఇంటికే రేషన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించిన టేక్ హెూమ్ రేషన్ (టీహెచ్ఆర్) పథకాన్ని మండలంలోని కొత్తవలసలోని సర్పంచ్ రెడ్డి అనిత అప్పలనాయుడు లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. అనంతరం దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దిశా యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే చేసుకొని ఆపద సమయంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు, అంగన్వాడి టీచర్, ఆశ వర్కర్లు , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల తరలింపులో పాలకులు మౌనం వీడాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఏనుగులను తరలించడంలో పాలకులు మౌనం దేనికోసమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏనుగుల వల్ల ఇప్పటికే జిల్లాలో 11మంది చనిపోగా, సుమారు రూ.4కోట్లు వరకూ ఆస్తి, పంట నష్టం జరిగిందన్నారు. ఇలాంటి సందర్భంలో రాత్రీ, పగలు తమ పంటలను కాపాడుకోలేక తమ ప్రాణాన్ని కాపాడుకోలేక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు భరోసా ఎప్పుడు కల్పిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఏనుగులను శాశ్వతంగా అటవీ ప్రాంతానికి తరలించాలని కోరారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టుపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

సింగిల్ మేజర్ సబ్జెక్టుపై అవగాహన సదస్సు శుక్రవారంనిర్వహించారు. ఈ సదస్సులో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జీవనజ్యోతి మాట్లాడుతూ నాలుగు విభాగాల్లో సింగిల్ మేజర్ విధానం నిర్వహిస్తున్నామన్నారు. బిఎస్సి లో కంప్యూటర్ సైన్స్ మేజర్ గాను ఫిజిక్స్ మైనర్ గానూ, బిఎలో హిస్టరీ మేజర్ గానూ పొలిటికల్ సైన్స్ మైనర్ గానూ, బీఎస్సీ సిబిజెడ్‌లో కెమిస్ట్రీ మేజర్, బోటనీ మైనర్, బికాంలో కంప్యూటర్ అప్లికేషన్స్ అడ్మిషన్లు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పై కోర్సులు చదవగోరు విద్యార్థులు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వి.ప్రభాకర్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ ఎం.రవికిరణ్ కుమార్, బోటనీ అధ్యాపకులు డాక్టర్ ఫణికుమారి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - సీతంపేట

రానున్న వ్యాధుల సీజన్లో అప్రమత్తంగా సిబ్బంది, ప్రజలు ఉండాలని ఎంపిడిఒ కొండపల్లి సత్యం వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కుసిమి, దోనుభాయి, మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్ వ్యాప్తి చెందుతాయని, హైరిస్క్ గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మలేరియా వ్యతిరేక మాస ఉత్సవాలు జూన్ 1 నుండి 30 వరకు నిర్వహించిన సందర్భంగా సీతంపేటలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

కోట్ల ఆస్తులున్నా... నిర్వహణ సున్నా

ప్రజాశక్తి -పార్వతీపురరూరల్

కోట్లాది రూపాయిలు విలువచేసే ఆస్తులున్నా నిత్యం దూపదీపనైవేద్యాల్లేక జగన్నాథుడు పస్తులు ఉంటున్నాడు. శతాబ్దకాల క్రితం జయపురం మహారాజుల దాతృత్వంతో నిర్మించిన మండలంలోని ఎమ్మార్‌నగరం సంస్థానం రాజవంశీకులు ఏలుబడిలో ఎంతోవైభవంగా చారిత్రక నేపథ్యం కలిగిన జగన్నాథ స్వామికి నిత్యకైంకర్యాల నిమిత్తం సుమారు 32 ఎకరాల భూములు ఉన్నాయి. ఆ భూములను స్వామికి సేవలు అందించే పూజారి తన ఆర్థిక అవసరాలకు తాకట్టులోకి వెళ్లిపోయాయి. దీంతో దేవాయలంలో కనీసం నిత్యపూజలు జరగడంలేదు. ఒకప్పుడు పార్వతీపురం పట్టణం తర్వాత ఎంఆర్ నగర్‌లో అత్యంత వైభవంగా జరిగే రథయాత్రకు భక్తులు పోటెత్తావారు. ఏడాదిలో పదిరోజులు జరిగే ఈ పండగకు వచ్చే ఆదాయంతో పూజరులు కుటుంబాలు ఏడాది పొడవునా జీవనం గడిపేవారు. ఎప్పుడైతే ఆలయ వైభవం కోల్పోయిందో అర్చకుల బతుకులు కూడా వెలవెలబోయాయి. ఇప్పుడు రథాయాత్ర ఉత్సవాలు ఏడాదికి ఒకరు నిర్వహించుకుని, ఆ ఆదాయం అనుభవించేందుకు ఒప్పందంతో కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితులు మారడంతో ప్రతిఏటా రథాన్ని వారే తయారు చేయాల్సి ఉండగా, రథం తయారీ ఖరీదుగా మారడంతో ఈ ఏడాది రథం లేకుండా, ట్రాక్టరుపై స్వామివారిని ఊరేగించే పరిస్థితికి దిగజార్చడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న మాన్యాలపై విచారణ జరిపి దేవుని ఆస్తులతో పాటు దేవాలయాన్ని దేవాదాయ శాఖకు దఖలుపర్చి, ఆలయ నిర్వహణ ప్రభుత్వమే చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పరాయిపంచన జగన్నాథుడు

ఎమ్మార్‌నగరంలో ఎన్నోఏళ్ల క్రిత నిర్మించిన జగన్నాథ స్వామి ఆలయం నిర్వహణ లేక కూలిపోవడంతో పక్కనే ఖాళీస్థలంలో స్థానిక తనికెళ్ల వారి కుటుంబానికి చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తన సొంత ఖర్చులతో నిర్మించిన ఇరుకు గదిలోనే జగన్నాథుడు పూజలు అందుకుంటు కాలం వెళ్లబుచ్చుతున్నారు.

కోట్లు విలువైన భూములు పరుల పాలు

పార్వతీపురం నుండి ఒడిషా వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని, ఎమ్మార్‌నగరంకు చేరువలో సర్వే నం.263/1లో 15.74సెంట్లు, 263/2లో 2.66సెంట్లు, 268/1లో2.89 సెంట్లు, 268/2లో 1.84 సెంట్లు, 269/1 లో 5.1సెంట్లు, 269/2లో 4.2సెంట్లు మొత్తం 32 ఎకరాలుగా పైగా కోట్లాది రూపాయిలు విలువైన ఆస్తులు ఉన్నాయి. ఇవి పూర్తిగా తాకట్టులో ఉండడంలో అటు పూజరులకుగానీ, ఇటు దేవుళ్లకు గాని ఫలసాయం అందక దేవుడు పస్తులు ఉండే పరిస్థితి.

ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, గుడిని అభివృద్ధి చేయాలి

ఎంతో చారిత్రక వైభవం కలిగిన దేవాలయం, కనీసం పూజలు నిర్వహించని దుస్థితికి చేరుకోవడం బాధాకరం. ప్రభుత్వం జగన్నాథ దేవాలయం ఆస్తులపై విచారణ జరిపి, దేవాదాయ శాఖకు దఖలు పరిచి, దూపదీపాలకు నిధులు కేటాయించడమే కాకుండా, జీర్ణమైన ఆలయాన్ని పునరుద్దరించాలి.

తేలు శంకరరావు, ఎమ్మార్‌నగరం గ్రామస్తుడు.

దేవాదాయ శాఖకు దఖలు పర్చేందుకు పంచాయతీ తీర్మానం

తాకట్టులో దేవాలయ భూములు



అభివృద్ధికి నోచుకోని జగన్నాథుడి ఆలయం

తమ గ్రామంలో ఉన్న జగన్నాథ స్వామి దేవాలయం నిర్వహణను పూజరులు సక్రమంగా నిర్వహించడం లేదు. దీంతో దేవునికి కనీస సేవలు కరువవుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయానికి ఉన్న ఆస్తులతో సహా దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుని, ఆలయం అభివృద్ధి చేసుకోవాలని కోరుతూ పంచాయితీ సర్వసభ్య సమావేశంలోనూ, గ్రామసభలోనూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం.

వంగపండు లక్ష్మి,
ఎమ్మార్‌నగరం గ్రామ సర్పంచ్

సిఎం పర్యటనను ఆదివాసీలంతా వ్యతిరేకించాలి

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కురుపాం పర్యటనను ఆదివాసీలంతా వ్యతిరేకించాలని ట్రైబుల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు పిలుపునిచ్చారు. బోయ వాల్మీకిల్ని ఎస్టీ జాబితాలో చేర్చుతూ చేసిన తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించిన తర్వాత మొట్టమొదటిసారిగా ఏజెన్సీ ప్రాంతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మొట్టమొదటిసారిగా వస్తున్నారని అన్నారు. జిల్లాలో ఉన్న ఆదివాసీలంతా బోయ, వాల్మీకిల్ని ఎస్టీ జాబితాలో చేసి తీర్మానాన్ని రద్దు చేసిన తర్వాత మాత్రమే ఆదివాసీ ప్రాంతానికి సిఎం రావాలని ఆదివాసీ ప్రజలందరికీ విన్నవించుకుంటున్నానని అన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యే, ఎంపి, గిరిజన శాఖ మంత్రి, వైసిపి ప్రజాప్రతినిధులు సిఎం పర్యటనను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. లేకుంటే బోయ వాల్మీకిల్ని ఎస్టీ జాబితాలో చేరుస్తున్న తీర్మానానికి మీరు అనుకూలంగా ఉన్నారా? వ్యతిరేకంగా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. 40 లక్షల మంది ఉన్న బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చినట్లయితే అసలైన ఆదివాసీలు తీవ్రమైన అన్యాయానికి గురవుతారని అన్నారు.

చెరువు కాదిది... క్రీడా మైదానమే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మీరు చూస్తున్నది చెరువు అనుకుంటున్నారా? కాదు... కాదు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానం. ఈ మైదానంలోనే జిల్లాస్థాయి క్రీడలతోపాటు, ఆగస్ట్ 15 న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కళాశాల మైదానం మొత్తం వరద నీరు చేరి బయటకు వేళ్లేందుకు దారిలేక నిలిచిపోయింది. ఈ మైదానానికి శుక్రవారం ఉదయం వ్యాయామం, వాకింగ్, రన్నింగ్ చేసేందుకు వచ్చే చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు వెను తిరిగే పరిస్థితి వచ్చింది. ఒకరోజు కురిసిన వర్షానికి మైదానం ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో ప్రతిరోజూ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అప్పటి పరిస్థితి ఎలా ఉంటుందో. ఇప్పటికైనా వర్షం నీరు బయటకు వెళ్లేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న క్రీడా మైదానం

పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ఇటీవల జరిగిన తెలుగుదేశం మహానాడు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఓటర్ల జాబితా పర్యవేక్షణ చేయాలని, గృహాల మ్యాపింగ్ కూడా సరిచూసుకోవాలని, భవిష్యత్తు గ్యారెంటీ అనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సీనియర్ నాయకులు వాడాడ రాము మాట్లాడుతూ తెలుగుదేశం పేదలకు అనుకూలమైన అనేక హామీలను తీసుకొచ్చినందని, వీటిని ప్రజలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేస్తే పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి తమ వంతు కషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంకి రామ్మోహన్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బాబ్జీ, రాంబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గృహనిర్మాణాలు వేగవంతం చేసేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని గృహ నిర్మాణశాఖ డిఇ ఆర్‌ఐవి ప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 2506 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు రాగా, 1446 ఇళ్ల నిర్మాణాలు ఇప్పటి వరకు పూర్తయ్యాయని, ఇంకా 137 ప్రారంభించలేదని, 321 ఇళ్ల పనులు ప్రారంభించారని, 394 గృహాలు పునాది స్థాయిలో, 154 గృహాలు 9 అడుగుల ఎత్తులో నిర్మాణాలు జరిగాయని, 54ఇళ్ల పైకప్పు నిర్మాణాలు జరిగాయని అన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు నిర్మాణాలపై అవగాహన కల్పించి సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.విజయలక్ష్మి, హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకీరామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



శిరీషను అభినందిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

ఇంటర్ స్టేట్‌టాపర్‌కు అభినందనలు

ప్రజాశక్తి- సీతంపేట

ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్ నిలిచిన విద్యార్థిని టి.శిరీషను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శుక్రవారం అభినందించారు. స్థానిక బాలికల గురుకుల కళాశాలకు చెందిన టి.శిరీష రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడంతో సిఎం చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందుకున్నారు. అదే విధంగా జిల్లా స్థాయిలో కలక్టర్ చేతుల మీదుగా రూ.50వేలు చెక్కును అందుకున్నారు. శిరీషను డిడి ఎం.శ్రీనివాసరావు, డిప్యుటీ డిఇఒ ఎ.లిల్లీరాణి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి సూర్యకుమారి, గురుకులం సెల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తం : డిఐఒ

ప్రజాశక్తి - పాచిపెంట

హై రిస్క్ గర్భిణులను గుర్తించి ప్రసవం పూర్తైన కొన్ని రోజుల వరకు వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు ఆదేశించారు. పాచిపెంట, గురువి నాయుడుపేట పిహెచ్‌సిలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ మేరకు ఆయన ఒపి రికార్డులను పరిశీలించి నమోదవుతున్న రోగాలను, వారికిస్తున్న చికిత్సా వివరాలు పరిశీలించారు. ల్యాబ్‌ను పరిశీలించి రక్త పరీక్షలు, జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి రికార్డులు తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించి అన్ని సాధారణ రోగాలకు మందులు అందుబాటులో ఉండేలా ఫార్మాసిస్టు ఎప్పటికప్పుడు రికార్డులు, ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. అలాగే వ్యాధినిరోధక టీకాల నిల్వలను పరిశీలించి స్టాక్, వినియోగం వివరాలను ఈవిన్ పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఆయన వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాల నివేదికలను సచివాలయాల వారీగా పరిశీలించి పురోగతి తక్కువగా ఉన్న సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణీల నమోదు త్వరగా చేయాలని, గర్భిణీలకు, పిల్లలకు టీకాలను సకాలంలో వేసి టీకా కార్డులో నమోదు చేయాలన్నారు. నవజాత శిశువుల గృహ సందర్శనలు తరచుగా చేయాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.రవిచంద్ర, డాక్టర్ బి.స్తుతి, సిహెచ్ఒ జి.శోభారాణి, సూపర్ వైజర్స్ సుహాసిని, లక్ష్మి,జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు : స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో పి పి యూనిట్ విభాగంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో డిఐఒ జగన్మోహనరావు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వార్డు సచివాలయాల వారీగా ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలను పరిశీలించి సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణులపై ఆరోగ్యంపైనా, సీజనల్ వ్యాధులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎ.ప్రియాంక, సూపర్ వైజర్లు ఎ.వి రత్నం,జయగౌడ్, ఎ ఎన్ ఎమ్ లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యసేవలపై అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

మాదక ద్రవ్యాల వాడకం, రవాణాపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ అధారిటీ ఆధ్వర్యంలో ఈనెల 24న స్థానిక రెండవ అదనపు జిల్లా కోర్టు సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన, డ్రగ్స్, డ్రగ్స్‌తో వ్యవహరించే వారికి శిక్షా నిబంధనలు, మొదలగు వాటిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

కిశోర బాలికలకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

వికలాంగులు, రక్తహీనత, డ్రాపౌట్ కిశోర బాలికల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు సిడిపిఒ సత్యవతి కోరారు. శుక్రవారం పట్టణంలోని రామా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో వికలాంగులు, డ్రాపౌట్, రక్తహీనతతో బాధపడుతున్న కిశోర బాలికలకు ఆమె పోషకాహారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సూపర్ వైజర్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే ఉపసంహరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డి దారిన విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలను మోసగించిందన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు విద్యుత్ భారాన్ని తగ్గిస్తామని ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు ఏకంగా రూ.6వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం ప్రజలను మోసగించడం తప్ప మరొకటి కాదన్నారు. 200 యూనిట్లు లోపు వాడే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీ ఇచ్చి మాట తప్పరన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్తును క్రమంగా నీరు కారుస్తున్నారన్నారు. ఇప్పటికైనా కార్పోరేట్ సంస్థలకు దోచిపెట్టే విధానాలను మానుకొని, సామాన్య ప్రజల కోసం ఇచ్చిన హామీ అమలు చేసి విద్యుత్ ఛార్జీల తక్షణమే తగ్గించాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు వెంకటరమణ, ఐద్వా నాయకులు టి సౌజన్య, కోరాడ లక్ష్మి, కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పి.కోనవలసలో గుళిచోడి క్షేత్రం

ప్రజాశక్తి - పాచిపెంట

చోడి సాగులో గుళి చోడి పద్ధతి ఎంతో మేలైందని, దిగుబడులు దాదాపు రెట్టింపు వస్తాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. గత రబీ సీజన్లో కేసలిలో రైతు మీసాల మోహనరావు గులి చోడి పద్ధతిలో ఎకరానికి 14 క్వింటాళ్ల దిగుబడి సాధించారని, ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని పి.కోనవలసలో రైతు ఎం.కుమార్ గులి పద్ధతిలో చోడి పంట సాగుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎఒ రైతులతో మాట్లాడుతూ మండలంలో గుళి పద్ధతిలో చోడి పంట సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఖరీఫ్ సీజన్లో 14 బస్తాలు, రబీ సీజన్లో 20 బస్తాలు దాటి దిగుబడి వచ్చే వీలుందన్నారు. మూడు పంటల సరళికి అనువైన పంట చోడి పంట అని అన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే పంట అని, అలాగే అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 పురస్కరించుకుని అన్ని రకాల చిరుధాన్యాలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు జరుగుతుందని తెలిపారు. కావున రైతులు ఎక్కువగా గులి రాగి పద్ధతిపై దృష్టి సారించాలన్నారు. ఈ పంట సాగు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ హైమావతి, ప్రకృతి సేద్య సిబ్బంది యశోదమ్మ, బాలకృష్ణ, సురేష్, విఎఎ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

వరహాల గెడ్డ బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని వరహాల గెడ్డ బాధిత రైతులను ఆదుకోవాలని జనసేన నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక రైల్వే ట్రాక్ ఆవల ఉన్న సాయినగర్ కాలనీ సమీపంలోని వరాహాల గెడ్డ బాధిత రైతులకు చెందిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ పట్టణ మెయిన్ రోడ్డు మీదుగా ప్రవహిస్తూ రైల్వే ట్రాక్ దాటి వచ్చే వరహాలు గెడ్డ గతంలో పొలాల మధ్యగా ప్రవహించి, కొర్ల చెరువులో కలిసి అక్కడ నుండి రాళ్లగెడ్డకు ప్రవాహం వెళ్లి కలిసేదన్నారు. అయితే రెండేళ్ల క్రితం ఈ గెడ్డ ప్రవాహంలో మున్సిపాలిటీకి చెందిన మురుగునీరు కవడంతో దాదాపు 50 ఎకరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం అన్నారు. అనంతరం జనసేన నాయకులు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు, అధికారులు రైతుల సమస్య పరిష్కరించాలన్నారు. వరహాల గెడ్డ గట్టును నిర్మించి పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ పనుకు చేపట్టి, గడ్డ ప్రవాహం నేరుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రైతులకు ప్రతి ఏటా ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చందక అనిల్‌కుమార్, వంగల దాలినాయుడు, నెయ్యి గాపుల సురేష్, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, మానేపల్లి ప్రవీణ్, బోనెల గోవిందమ్మ పాల్గొన్నారు.

లక్ష లీటర్ల వాటర్ ట్యాంకు మంజూరు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా లక్ష వేల లీటర్ల వాటర్ ట్యాంకులు మంజూరైనట్లు సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. 30 ఏళ్ల కిందట మంజూరైన 20వేల లీటర్ల వాటర్ ట్యాంక్ నీరు 200 కుటుంబాలకు మాత్రమే సరిపోతుందని అన్నారు. ఈ సమస్యపై జగనన్నకు చెబుదాం కాల్ సెంటర్‌కు ఫోన్ చేయడంతో లక్ష వేల లీటర్ల వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్ తెలిపారని అన్నారు. గ్రామంలో ప్రస్తుతం 951 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని ఫోన్ ద్వారా తెలపడంతో జలజీవన్ మిషన్ ద్వారా రూ.89.51 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిశోర్ కుమార్, విఆర్ఒ కృష్ణారావు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని జగన్నాథపురంలో త్రినాథస్వామి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఒకే కుటుంబానికి చెందిన రాగోలు శంకర్రావు, రాము, సాయికి గాయాలైనట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

సీతంపేట మండలంలో పాతలోవ గూడ కాలనీకి చెందిన సవర ఎరకయ్యా శుక్రవారం కర్రలు కోసం చెట్టు ఎక్కి వర్షంతో జారిపడ్డాడు. వెంటనే గ్రామస్తులు 104లో స్థానిక ఏరియా ఆసుపత్రికి చేర్పించినప్పటికీ అక్కడ పడకలు లేకపోవడంతో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.